# గ్రడు

శ్రీ దెందులూరి వీరరాఘవరావు

రోజూ లాగేకాళ్లు వాటిపని అవి చేస్తున్నాయి. పెడల్సు పైకి క్రిందికి జోరుగా తిరుగుతున్నాయి. నల్లటి కొండచలువలాగవున్న ఆ తారురోడ్డుమీద నా సైకిలు ఫుల్ స్పీడులో పోతూంది. నాముందు ఒక జట్కాబండి వెళ్తూంది. వెధవ జట్కా, సైకిలు కంటె ముందుపోవడం ఏమిటి? నా స్వాభిమానం సహించలేక పోయింది. సైకిలుకి యింకా స్పీడు ఎక్కించేను.

ఒక అరనిమిషంలో నా సైకిలు జట్కానిసమీపించింది. ఎదురుగుండా మోటారు లారీ వస్తూండడం చేత నేను జట్కాను దాటించి ముందుకి పోవడానికి వీల్లేకపోయింది, కొంతదూరందాకా జట్కా వెనకాలే వెళ్లవలసి వచ్చింది. ముందుకి పోవాలనే తొందరచేత నాచూపు యిటూ అటూ పరుగెత్తింది. ఒకక్షణకాలం జట్కాలోవున్న ఆవిడమీదకూడా పడింది......నా జన్మలో యిలాగ ఎప్పుడూ ఏస్త్రీవేపు కన్నెత్తిచూడలేదు. కర్మంచాలక నాదృష్టి ఎవళ్ళమీదేనా పడితే, అక్కడనుంచి త్రిప్పివెయ్యడానికి ప్రయత్నించేవాడిని. నాకు స్త్రీ సమాజం అంటే అసహ్యం! కారణం ఏమిటంటే, స్త్రీ వర్గమంతా నన్నుచూసి అసహ్యించుకుంటారు. ఏసమాజం నన్ను అసహ్యించుకుంటుందో, ఆ సమాజానికి నేనెందుకు సానుభూతి చూపించాలి? అంచేత, స్త్రీ సమాజ తర్కవితర్కాలలో నే నే మీ కలగజేసుకోను.

ఈవాళ, మొదటిసారి, ఒక స్త్రీ, నన్ను సహానుభూతి పూర్ణదృష్టితో చూసింది. దాన్ని నేనెందుకు అవహేళన చెయ్యాలి? నాలోనూ మానవత్వం వుంది. ఆవిడ నావేపుచూసి నవ్వుతూంది! నాశరీరంలో ఎలక్ట్రిక్ కరేంటు పాకినట్టయింది. శరీర రోమాంచంవల్ల ఒంటినిండా చెమటుపట్టింది. కాళ్లు పనిచెయ్యడం మానేసేయి. జట్కాని దాటించాలన్న కోరిక, పెద్దగాలిలో కాగితం ముక్కలాగ ఎగిరిపోయింది. సైకిలు జట్కా వెనకాలే మెల్లిగా వెళ్ళడం ప్రారంభించింది. నా బుర్రలో ఆలోచనలు ఊరికే తిరిగిపోతున్నాయి. ఆవిడ పూర్ణ నవయవ్వనవతి. యవ్వనరసం ఆవిడ ప్రతీ అంగంలోంచీ వుబికిపడుతూంది. చూసి మూర్ఛపోయే అందం లేకపోయినప్పటికి మోహింపచేసే శక్తివుంది. పెదిమెల మధ్యనుండి వెలువడే ఆచిరునవ్వు మేఘాలచాటునుండి సంగ యువతలికి వచ్చిన చంద్రుడిలాగవుంది. ఆవిడ నన్నుచూసి నవ్వుతూంది కాదూ? ఏమో? నన్నుచూసి కాదేమో? నాకు పూర్ణవిశ్వాసం లేకపోయింది. నా ముఖంలో అంత ఏముంది? నన్నుచూసి నవ్వడానికి? బహుశా నాదృష్టి భ్రమ యేమో! మళ్ళీ ఒకసారి చూద్దాం...ఇప్పుడు పూర్తి విశ్వాసం కలిగింది.

ఆఖరికి నామనస్సు వప్పుకుందికాదు. తెగించి స్త్రీ వేపు చూడ్డం యిదే మొదటిసారి. ఇంకా ఆవిడ నావైపే చూస్తూంది. ఆకళ్ళల్లో లజ్జాభావం కనిపిస్తూంది, ఆ అధరాల్లో ఆ చిరునవ్వే తాండవిస్తోంది. నా హృదయం ఉద్రేకం పొందింది. నన్ను నేను ఆపుకోలేకపోయేను. నా పెదిమెలనుండి కూడా ఒక చిరునవ్వు పారిపోయింది. మళ్ళీ ఆలోచనలో పడింది నా మస్తిష్కం. స్త్రీలతోటి కలగచేసుకోవడం మొదటిసారి. అలాంటప్పుడు అజాగ్రత్తగవుండకూడదు. స్త్రీల సైకాలజీని గురించి నేవిన్నదేమిటంటే ఒక యువతిమీద తనప్రేమ ఒక్కసారే వెల్లడించకూడదు. అలా చేస్తే ఆయువతికి స్వాభిమానం ఎక్కువై దూరంగా పోతుందిట. ఏంచెయ్యను? ఏమీ నిశ్చయం కావడం లేదు. ఆలోచనా ప్రవాహంలోపడి కొట్టుకుంటున్నాను.

ప్రపంచంలో స్త్రీలందరూ ఒక్కలాగే వుంటారా? వివేకవతులుకూడా వుంటారు. ఈకాలంలో ఆడంబర జీవితానికి ఎక్కువ గౌరవంవుంది. అంటే మనుష్యులంతా బాహ్యసౌందర్యాన్నిచూసి మోహించేవారని కాదు. సినీమా సంగీతంవిని ప్రజలు శాస్త్రీయ సంగీతాన్ని మరిచిపోయేరు. అయినప్పటికి శాస్త్రీయ సంగీతం విలువ పూర్తిగా నశించిపోలేదు. దాన్ని గౌరవించే సంగీత రసజ్ఞులు ఇప్పుడుకూడావున్నారు. మంచి గుణాల విలువ కనిపెట్టేవాళ్లు కొద్దిమందిమాత్రమే వుంటారు. స్త్రీజాతిలో యిటువంటివాళ్ళు బహుతక్కువ. వాళ్ళు బాహ్యసౌందర్యాని చూసి మోహించరు. అంతరిక సౌందర్యాన్నే మోహిస్తారు. నా తెలివితేటలు, నాహృదయంలోవుండే భావాలు, నా ముఖంలో కనిపిస్తూవుండక తప్పదు. కాని వాటిని నాముఖంలో కనిపెట్టే వ్యక్తి (విశేషించి స్త్రీ) యింతవరకూ నాకు కనిపించలేదు. ఈవాళ ధన్యుణ్ణయేను. నాకోరిక ఫలించింది. నాశిరస్సు తనంతటదే శ్రద్ధతో వంగింది. నా హృదయం ఆమె చరణాలని స్పృశించాలని కోరింది.

ఇప్పుడు నాధ్యాన్నం నా గుణాలమీదికి పోయింది. నాలోనేను, నాగుణాలనిఒక్కటొక్కటే తీసి తర్కించుకుంటున్నాను.

ఆఖరికి నాలో లోపం ఏముంది? నావద్ద బుద్ధి వుంది, హృదయం వుంది. ముఖం ఒక్కటే అందంగా లేదు. అంతే! అంతరికిగుణాల జాజ్జ్వల్యమానంలో కురూపాంధకారం ఎంతవరకాగుతుంది? చదువులోను, ఆటపాటల్లోను, అగ్రగణ్యుడినే! విద్యకి బలానికి శతృత్వం ఉన్నప్పటికి, ఆ రెండూ నాదగ్గరున్నాయి. కాలేజీ డిబేటింగ్ సొసైటీలోనూ పేరుంది: బాక్సింగు క్లబ్బు సెక్రటరీ అవడానికి యోగ్యతావుంది! కర్ర త్రిప్పడం, యీదడం, మొదలైన స్పోర్ట్సు కాంపెటీషన్సులోనూ మెడల్సు సంపాదించేను. బాగా పాడగలను కూడాను. అసలు నాలోవున్న గొప్ప ఏమిటంటే ఈరోజులలో ఏ యువకునివద్దా కనిపించని శరీరపుష్టివుంది. ఇన్నిగుణాలుంటూండగా నేనందంగా లేనని ఎవడంటాడు? యువకునికి అందం తెచ్చేది శరీరమే కాని ముఖంకాదు. నా విశాల వక్షస్థలంలోను, కండలు కట్టిన నాదండలలోనూ ఆకర్షణ లేదూ?

నా శరీరాన్ని ఒకసారి చూసుకోవాలని బుద్ధి పుట్టింది. ఆవక్షఃస్థలం, ఆబాహువులు చూసుకుని ముగ్ధుణ్ణయేను.

మళ్ళీ ఒకసారి గర్వంతో నాశరీరాన్ని చూసుకున్నాను.

అర్ర్రే! కొంప మునిగింది.

నా ఆత్మప్రశంస, ప్రణయాలోచనలు, గాలిలో ఒక్కసారి ఎగిరిపోయేయి. ఛీ! సిగ్గు సిగ్గు! సిగ్గుచేత నాలో నేను అంతమైపోవడానికి కోరేను. ధరతి మాత రెండుపాయలై తనలో దాచుకుంటే బాగుండుననుకున్నాను. కాళ్ళు వాటంతటవే పెడల్సుని పైకి కిందికి గబగబా తిప్పేస్తున్నాయి. సైకిలు హతాశయై పరుగెడుతూంది. ఈప్రపంచంలో మనిషికి కనపడకుండా మాయమైపోతే బాగుండుననుకొన్నాను. నన్ను చూస్తే నాకే సిగ్గేస్తోంది.

చెప్పడానికికూడా సిగ్గుగా వుంది!

నా ఫంట్లానికి బొత్తాయిలులేవు. లోపల కట్టుకున్న అండర్ వేర్ పైకి కనిపిస్తూంది.

నాకళ్ళు చీకట్లు కమ్మేయి. ఆవిడ వెకిలినవ్వు నాచెవుల్లో గింగురుమంటూంది. మళ్ళీ వెనక్కి తిరిగి చూస్తే వొట్టు!

రాట్నంతో నా
స్వరాజ్యం
అంటూ ఈసడించే
ప్రబుద్ధులు

"అమృతప్రాశ"తోనా
ఆరోగ్యం
అంటూ సందేహించే
దురదృష్టవంతులు
దేశంలో
ఇంకా ఉన్నారు.

అట్లాంటివారు
ఇకనైనా
జాడ్యం చేయకుండా
రాట్నాన్ని చేబట్టిన్ని
"అమృతప్రాశ"ను సేవించిన్ని
దేశాన్ని - దేహాన్ని
ఉద్ధరించుకోవడం
మంచిది.

స్వామీస్ 'అమృతప్రాశ'

అశ్వినీ కుమార్ ఫార్మసి
నరసాపురం.